సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023

రాజన్న పాహిమాం

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమతమ మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ దేవాలయాలను సందర్శించారు.



న్యూస్‌రీల్

22న జెడ్పీ సర్వసభ్య సమావేశం

సిరిసిల్ల: జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 22న నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని వివరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బీఆర్‌ఎస్ నాయకులకు కేటీఆర్ పరామర్శ



అబ్బాడి అనిల్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభించిన అనంతరం తిరుగుప్రయాణంలో మంత్రి కేటీఆర్ తంగళ్లపల్లి మండలంలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన నర్సింహులపల్లి మాజీ సర్పంచ్ మంద నర్సయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. నర్సయ్య చిన్నకూతురు హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ చదువుతుండగా.. అధైర్యపడొద్దని ఫీజు తాను చెల్లిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లెల్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సతీశ్‌ను పరామర్శించారు. సీనియర్ యూత్ నాయకుడు అబ్బాడి అనిల్‌రెడ్డికి పితృవియోగం కాగా.. వారి కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. అనిల్ చిన్నాన్న కొడుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య పల్లవితోపాటు ఇద్దరు పిల్లలను ఆదుకోవాలని మంత్రిని కోరగా.. వెంటనే కలెక్టర్ అనురాగ్ జయంతికి ఫోన్ చేసి పల్లవికి వ్యవసాయ కళాశాలలో ఉద్యోగం కల్పించాలని, వితంతు పెన్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు.

'దళితులకు ఏం చేశారు'



ఆందోళన చేస్తున్న ఎస్సీలు

ముస్తాబాద్(సిరిసిల్ల): దళితులకు ఈ ప్రభుత్వం ఏం చేసిందంటూ ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో శుక్రవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ మాల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ దళితులకు ఇస్తామన్న మూడు ఎకరాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కమ్యూనిటీ భవనం నిర్మిస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు ఇప్పటి వరకు పనులు చేపట్టలేదన్నారు. మండల ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు ద్వారానే బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ఎదురుగట్లలో అంగన్‌వాడీని తెరువనివ్వని సర్పంచ్



ఎదురుగట్లలో తాళం పగులగొడుతుండగా అడ్డుకుంటున్న సర్పంచ్

వేములవాడరూరల్: డిమాండ్లు నెరవేర్చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు బడులకు తాళాలు వేసి ఆందోళనబాట పడుతున్న విషయం తెలిసిందే. మండలంలోని ఎదురుగట్లలోని అంగన్‌వాడీ భవనం తాళాన్ని అధికారుల ఆదేశాలతో శుక్రవారం పగులగొట్టేందుకు ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి రావడంతో సర్పంచ్ సోయినేని కరుణాకర్ అడ్డుకున్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన చేపడితే ప్రభుత్వం తాళాలు పగులగొట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు.

నేడు స్వచ్ఛత ర్యాలీ

సిరిసిల్లటౌన్: స్వచ్ఛత లీగ్ సీజన్–2లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు అంబేడ్కర్‌చౌక్ నుంచి బతుకమ్మ ఘాట్ వరకు ర్యాలీ నిర్వహించి మానేరు పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్యం డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని కోరారు.

గడప గడపకు వైద్యసేవలు



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై అరుణ, రవీందర్‌రావు, గూడూరి ప్రవీణ్, ఎమ్మెల్యేలు రసమయి, రవిశంకర్, వేములవాడ అభ్యర్థి లక్ష్మీనరసింహారావు

- మోడల్ మెడికల్ కాలేజీగా మారుస్తా
- ఆరు నెలల్లో మౌలిక వసతులు కల్పిస్తాం
- సిరిసిల్లలో మంత్రి కె.తారక రామారావు
- జిల్లా మెడికల్ కాలేజీ ప్రారంభం

సిరిసిల్ల: మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లాలో గడపగడపకూ వైద్యసేవలు అందుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. ఆరు నెలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు వద్ద మెడికల్ కాలేజీని శుక్రవారం ప్రారంభించిన అనంతరం అంబేడ్కర్ సర్కిల్ వద్ద జరిగిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభలో మాట్లాడారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో తాగు, సాగునీరు వచ్చిందని.. విద్య, వైద్యరంగాల్లో పెను మార్పులు వచ్చాయని భావిస్తే సిరిసిల్లలో నన్ను, వేములవాడ మా లక్ష్మీనర్సింహారావును గెలిపించాలని కోరారు. సిరిసిల్ల జిల్లా ఏర్పాటుతోపాటు మెడికల్ కాలేజీ, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ, వ్యవసాయ డిగ్రీ కాలేజీలు ఏర్పాటయ్యాయన్నారు. త్వరలోనే జిల్లాకు ఆక్వా యూనివర్సిటీ రాబోతుందని తెలిపారు.

అభివృద్ధి సాధించిందని నమ్మితేనే గెలిపించండి..

సిరిసిల్ల అభివృద్ధి సాధించిందని భావిస్తేనే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కేటీఆర్ కోరారు. నాకైతే సంపూర్ణమైన నమ్మకం ఉందని, గుండె లోతుల్లోంచి చెబుతున్నానన్నారు. సిరిసిల్ల ప్రజలకు మందు పొయ్యి.. పైసలు ఇయ్య అంటే.. చాలా మంది ప్రశ్నించారని.. కానీ ఇక్కడి ప్రజలపై ఉన్న నమ్మకంతోనే ఆ మాటలు చెబుతున్నానని స్పష్టం చేశారు. మధ్యమానేరులోకి గోదావరి జలాలను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెచ్చామని, మల్కపేట రిజర్వాయర్‌తో బీడు భూములకు సాగునీరు వస్తుందన్నారు. 1001 గురుకులాలతో నాణ్యమైన విద్యనందిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. 2009లో ఎమ్మెల్యేగా ఉండగా సిరిసిల్ల ఆస్పత్రికి చైర్మన్‌గా ఉన్నానని, వైద్యులు లేక అప్పటి ఆస్పత్రి సూపరింటెండెంట్ నిర్మలాదేవి మీకు చేతనైతే డాక్టర్లను నియమించాలని కోరారని గుర్తుచేశారు. జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వంద మంది వైద్యులు అందుబాటులో ఉండి.. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుతాయని కేటీఆర్ పేర్కొన్నారు. జబ్బు ఏదైనా.. డబ్బులు లేకుండానే ఉచితంగా వైద్యం అందుతుందని తెలిపారు.

మోడల్ మెడికల్ కాలేజీగా మార్చుతా

జిల్లా మెడికల్ కాలేజీని మోడల్‌గా మార్చుతానని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. పెద్దూరు శివారులోని మెడికల్ కాలేజీని సీఎం కేసీఆర్ వర్చువల్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన జ్యోతి వెలిగించి ప్రసంగించారు. కొత్త కాలేజీ, కొత్త భవనం కావడంతో కొన్ని సమస్యలు ఎదురవుతాయన్నారు. ఆ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. కలెక్టర్, జిల్లా అధికారులు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తారని వెల్లడించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా పరిష్కారానికి నేను ముందుంటానని మంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోనే మోడల్ మెడికల్ కాలేజీగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, బి.గౌతమ్‌రెడ్డి, ఆర్డీవో ఆనంద్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, ఏఎస్పీ చంద్రయ్య, మెడికల్ కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాల ఒప్పందం ఆవిష్కరణ

జిల్లాలోని కిశోర బాలికలకు జీవన నైపుణ్య శిక్షణపై టీఐఎస్‌సీ సంస్థతో జరిగిన ఒప్పందాన్ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. మెడికల్ కాలేజీలో జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు ఒప్పంద పత్రాన్ని తీసుకురాగా.. మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. జిల్లాలోని కేజీబీవీ విద్యార్థినుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు టీఐఎస్‌సీ శిక్షణ ఇవ్వనుంది.

350 నుంచి 10 వేల సీట్లకు.. : బోయినపల్లి వినోద్‌కుమార్

మేము చదువుకునే రోజుల్లో ఉమ్మడి రాష్ట్రంలో 350 మెడికల్ సీట్లు ఉండేవని, ఇప్పుడు 10వేల సీట్లు తెలంగాణలోనే ఉన్నాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణను ప్రపంచంలోనే గొప్ప ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే కసితో ఉన్నామని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చెలిమెడ లక్ష్మీనర్సింహారావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే వి.మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థం మాధవి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్



టీఐఎస్‌సీతో అగ్రిమెంట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్



కాలేజీ భవనం వద్ద మెడిసిన్ విద్యార్థులు



ర్యాలీగా వస్తున్న మంత్రి కేటీఆర్, చైర్‌పర్సన్‌లు

టెట్ అభ్యర్థులు ఆందోళన చెందొద్దు

- డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో టెట్ నిర్వహణలో తలెత్తిన సమస్యపై విద్యాధికారి రమేశ్‌కుమార్ స్పందించారు. ప్రశ్నాపత్రాలు మారిన మాట వాస్తమని, వాటిని సరిచేయడానికి ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఓఎంఆర్ షీట్‌లో వైట్‌నర్ ఉపయోగించేలా అనుమతినిచ్చామన్నారు. అభ్యర్థులు వైట్‌నర్ వాడడంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అభ్యర్థులు రాసిన జవాబుపత్రాలను ఆన్‌లైన్ ఉంచుతామని, అప్పుడు రాసిన జవాబులు వచ్చిన మార్కులను అభ్యర్థులు చూసేందుకు వీలుంటుందన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించిన తర్వాతే అన్ని విషయాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు.

అన్యాయం జరిగితే అధికారులే బాధ్యులు

టెట్ నిర్వహణలో తీసుకున్న తాత్కాలిక ఉపశమన మార్గాలతో ఎవరికీ అన్యాయం జరిగిన జిల్లా అధికారులు, రాష్ట్ర మంత్రి కేటీఆర్ బాధ్యులు అవుతారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. టెట్ అభ్యర్థులతో కలెక్టరేట్ చేరుకుని డీఈవో రమేశ్‌తో మాట్లాడారు. అధికారులు తప్పిదాలు చేసిన విషయం వాస్తవం అనుకున్నప్పుడు అలాంటి అధికారులపై శాఖాపరమైన చర్యలకు వెళ్లాలన్నారు. ప్రశ్నించిన విద్యార్థులను పరీక్ష హాల్ బయట పరీక్షలు రాయించిన అధికారి వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.



డీఈవోతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్, అభ్యర్థులు

పరీక్ష రాసే విద్యార్థులకు ఆంక్షలా

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశాంతంగా టెట్ రాసేందుకు వస్తే.. వారిపై ఆంక్షలు విధించడం ఏందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ కృతజ్ఞత సభ నిర్వహణపై ఆయన ఘాటుగా విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. టెట్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ విధించిన అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి బహిరంగసభను అంబేడ్కర్‌చౌరస్తాలో అనుమతించడాన్ని తప్పుబట్టారు. సభాస్థలికి సమీపంలో రెండు టెట్ సెంటర్లు ఉన్న విషయాన్ని విస్మరించి అధికారులు సభకు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారని ఇందులో కేటీఆర్ గొప్ప ఏముందని ప్రశ్నించారు. అధికార పార్టీ దుర్మార్గాలకు సిరిసిల్లలో జరిపిన సభ నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, రాష్ట్ర నాయకుడు నాగుల సత్యనారాయణగౌడ్, వెల్ముల స్వరూప, గోనె ఎల్లప్ప, టోని, దేవరాజు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



తెలంగాణచౌక్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆసాములు

సిరిసిల్లటౌన్: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన ఆసాములు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. స్థానిక తెలంగాణచౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఆసాములు, మ్యాక్స్ సంఘాలకు ఇస్తానన్న పింజర్ల సబ్సిడీ డబ్బులు రెండు దఫాలుగా రూ.18కోట్లు ప్రభుత్వం విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞత తెలుపుతూ కొత్తబస్టాండు నుంచి అంబేడ్కర్‌చౌక్ వరకు ర్యాలీ తీశారు. ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి చేరాల అశోక్, ఉపాధ్యక్షులు పోరండ్ల శ్రీనివాస్, కొండ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లు.. నవసమాజ నిర్మాతలు

సిరిసిల్లకల్చరల్: నవనాగరిక సమాజాన్ని నిర్మించేది ఇంజినీర్లే అని పలువురు వక్తలు కొనియాడారు. సిరిసిల్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంజినీర్స్‌డేలో భాగంగా ప్రభుత్వ వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లను సన్మానించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు నగునూరి శ్రీకాంత్, బచ్చు భానుచందర్, డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, చేపూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దసరా కానుకగా సీఎం అల్పాహార పథకం

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు సీఎం అల్పాహారం పథకం అమలుకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులను శుక్రవారం విడుదలయ్యాయి. దీంతో జిల్లాలో దాదాపు 42 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందనుంది. దసరా కానుక విద్యాశాఖ అమలు చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులకు ఈ అల్పాహారం అందించాలని అధికారులకు ఉత్తర్వులు వెలువడ్డాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఏకాగ్రతను పెంచే చర్యల్లో భాగంగా అమలు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే జిల్లా విద్యాధికారి మాత్రం శనివారం నుంచే జిల్లాలో అల్పాహారం పథకాన్ని అమలు చేయాలని హెడ్‌మాస్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలు అంటూ మెస్సేజ్‌లు పంపారు.

రైతుకు డ్రోన్ సాయం

- చేరువగా సాంకేతిక పరిజ్ఞానం
- తగ్గనున్న సాగుఖర్చు
- సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

గంభీరావుపేట(సిరిసిల్ల): సాగులో వ్యయం తగ్గించడంతోపాటు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వరి సాగులో కూలీల కొరత, పెట్టుబడులు పెరిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈక్రమంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్నదాతలకు అందుబాటులోకి తీసుకొస్తుంది. డ్రోన్‌ల సాయంతో క్రిమిసంహారక మందులు, ఎరువులు స్ప్రే చేసే విధానాన్ని రైతులకు పరిచయం చేస్తున్నారు. దీని ద్వారా ఖర్చు తగ్గడంతోపాటు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందును పిచికారీని చేసే వెసులుబాటు కలిగింది.

అవగాహన కల్పిస్తూ..

గంభీరావుపేట మండలంలో వేలాది ఎకరాల్లో వరి పంటనే సాగుచేస్తున్నారు. కూలీల కొరతను అధిగమించేందుకు ఇప్పుడిప్పుడే రైతులు వరి కోత యంత్రాలను, దుక్కులు దున్నడం, గడ్డిని కట్టలు కట్టే యంత్రాలను వినియోగిస్తున్నారు. ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలు, టార్పాలిన్లు, స్ప్రేయర్లను వినియోగిస్తున్న రైతులకు ప్రభుత్వం త్వరలో పురుగుమందులు, ఎరువుల పిచికారీకి డ్రోన్లను అందుబాటులోకి తేనుంది. పైలట్ ప్రాజెక్టుగా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలో 30 ఎకరాల్లో డ్రోన్ సాయంతో క్రిమిసంహారక మందును పిచికారీ చేశారు. డ్రోన్ వినియోగం, కలిగే ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఒక పంట కాలంలో ఎకరం విస్తీర్ణంలో పురుగుమందు స్ప్రేయర్లతో పిచికారి చేయాలంటే దాదాపు రూ.3వేల వరకు ఖర్చు అవుతోంది. అదే డ్రోన్ సాయంతో చేస్తే సగం ఖర్చు తగ్గనుంది. స్ప్రే చేయడానికి డ్రోన్‌లను అందుబాటులో ఉంచి, సహకార ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఒక్కో డ్రోన్ ఖరీదు సుమారు రూ.8 నుంచి రూ.10లక్షల వరకు ఉంటుంది.



మందు స్ప్రే చేస్తున్న డ్రోన్



దమ్మన్నపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అవగాహన కల్పించాం



డ్రోన్ వినియోగం గురించి శిక్షణ పొందాను. డ్రోన్ సాయంతో మందును స్ప్రే చేసే విధానం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. డ్రోన్ వినియోగించి స్ప్రే చేస్తే పంటలో మార్పులు కూడా ఉంటాయి. మందు వృథా కాదు. ఖర్చు తగ్గుతుంది.

– పురం విష్ణు, శిక్షణ పొందిన సహకార ఉద్యోగి, గంభీరావుపేట

జిల్లా వైద్యాధికారికి చేదు అనుభవం

- మెడికల్ కాలేజీ వద్ద అడ్డుకున్న పోలీసులు
- వెనుదిరిగిన డీఎంహెచ్‌వో

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావుకు చేదు అనుభవం ఎదురైంది. సిరిసిల్ల రెండో బైపాస్‌రోడ్డులోని మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి శుక్రవారం తన సిబ్బందితో జిల్లా వైద్యాధికారి రాగా.. పోలీసులు లోనికి అనుమతించలేదు. తాను జిల్లా వైద్యాధికారినని చెప్పగా.. సుమన్ మోహన్‌రావు ఒక్కడినే మెడికల్ కాలేజీలోకి పంపించి.. సిబ్బందిని ఇతర వైద్యులను నిరాకరించారు. దీంతో జిల్లా వైద్యాధికారి కాలేజీ ప్రారంభోత్సవానికి ముందే అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు ఈ కార్యక్రమానికి ఆశ కార్యకర్తలు రాగా.. పోలీసులు వారిని బైపాస్ రోడ్డు పైనుంచే వెనక్కి పంపించారు. ఈ విషయంలో జిల్లాలో చర్చనీయంగా మారింది.

క్లుప్తంగా

బకాయిలు చెల్లించాలి



సిరిసిల్ల డిపో ముందు ధర్నా చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

సిరిసిల్లటౌన్: బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం సిరిసిల్ల డిపో ముందు గేట్ ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ 2017, 2021 పెండింగ్ పీఆర్సీలను చెల్లించాలని, 2021 ఏరియర్స్ బాండ్ డబ్బులు, తొమ్మిది డీఏల ఏరియర్స్, పొదుపు సంస్థలైన సీసీఎస్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ, పీఎఫ్‌లకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. జేఏసీ నాయకులు పి.దేవయ్య, గణపతి, రమేశ్, నర్సయ్య, తిరుపతి, రామచంద్రం, జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



డీసీసీ ఆఫీసులో జెండాను ఎగురవేస్తున్న కాముని వనిత

సిరిసిల్లటౌన్: మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత పేర్కొన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఆఫీసులో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మహిళా అభ్యుదయం ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్ర నాయకులు మడుపు శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ వెల్ముల స్వరూప, హారిక, సరిత, రేణుక పాల్గొన్నారు.

నిఘా నీడలో ప్రయాణం

- ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు
- ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ చర్యలు
- 20 బస్సుల్లో ఏర్పాటు



బస్సులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



నిఘా నీడలో ప్రయాణికుల ప్రయాణం

వేములవాడఅర్బన్: ఆర్టీసీ బస్సుల్లో పోకిరీల బెడదను నివారించడంతోపాటు భద్రమైన ప్రయాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో జిల్లాలోని వేములవాడ ఆర్టీసీ డిపోలోని బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిత్యం వేలాది మంది భక్తులు రాజన్న దర్శనానికి వస్తుంటారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల భద్రతే లక్ష్యంగా 20 బస్సుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

20 బస్సుల్లో సీసీ కెమెరాలు

వేములవాడ ఆర్టీసీ డిపోలోని 13 డీలక్స్ బస్సులు, ఏడు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ బస్సులు హైదరాబాద్, వరంగల్ మార్గాల్లో నడుస్తుంటాయి. రాజన్న దర్శనానికి ఈ రూట్ల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తుంటారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణ

వేములవాడ డిపోలోని బస్సుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీల పర్యవేక్షణ జిల్లా పోలీసు కంట్రోల్‌రూమ్ ఆధీనంలో ఉంటుంది. బస్సుల్లో ప్రయాణించే మహిళల సంరక్షణ, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల లగేజీకి దొంగతనాలకు తావులేకుండా, పోకిరీ చర్యలకు చెక్ పెట్టేలా ప్రయాణికుల రక్షణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. బస్సుల్లోని ప్రయాణికులకు ఇబ్బంది జరిగిన వెంటనే తెలిసే అవకాశం ఉంది.

ప్రయాణికుల భద్రత కోసం..



రాజన్న ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు దూరప్రాంతాల నుంచి వస్తుంటారు. ప్రయాణికుల భద్రతకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని ఎక్కడ లేని విధంగా వేములవాడ డిపోలోని ఆర్టీసీ బస్సులకు మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. –మురళీకృష్ణ, వేములవాడ డీఎం

గుండెపోటుతో తెలంగాణ ఉద్యమకారుడు మృతి



రుద్రంగిలో చెరువులో నిరసన తెలుపుతున్న వెంగళ కొమురయ్యగౌడ్ (ఫైల్)



కృష్ణుడి వేషాధారణలో నిరసన తెలుపుతున్న వెంగళ కొమురయ్యగౌడ్ (ఫైల్)

- వినూత్న నిరసనలతో కొమురయ్యగౌడ్‌కు గుర్తింపు
- కేసీఆర్, కేటీఆర్‌లతో సాన్నిహిత్యం
- రాష్ట్ర ఏర్పాటు తర్వాత గుర్తింపు కరువు

రుద్రంగి(వేములవాడ): తెలంగాణ మలిదశ ఉద్యమంలో వినూత్న నిరసనలతో గుర్తింపు తెచ్చుకున్న ఉద్యమకారుడు రుద్రంగికి చెందిన వెంగళ కొమురయ్యగౌడ్ గుండెపోటుతో శుక్రవారం మరణించారు. ఆయన మరణంతో తెలంగాణ ఉద్యమకారులను కలచివేసింది. పలు రాజకీయ పార్టీల నాయకులు కొమురయ్యగౌడ్ అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో సాన్నిహిత్యం

రుద్రంగికి చెందిన కొమురయ్యగౌడ్ తెలంగాణ ఉద్యమ సమయంలో వినూత్న నిరసనలతో గుర్తింపు తెచ్చుకున్నారు. కొమురయ్యగౌడ్ కృషిని గుర్తించిన కేసీఆర్, కేటీఆర్‌లు హైదరాబాద్‌కు పిలిపించుకొని అభినందించారు. ఉద్యమ సమయంలో దాదాపు 128 రకాలా విషధారణలతో నిరసన తెలిపారు.

తెలంగాణ వచ్చాక నిర్లక్ష్యం

ఉద్యమ సమయంలో గుర్తింపు తెచ్చుకున్న కొమురయ్యగౌడ్‌కు తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పెద్దగా గుర్తింపు దక్కలేదు. తర్వాత కాలంలో పార్టీలోకి వలసలు పెరగడం, ఆర్థిక పరిస్థితులు అంతంతే ఉండడంతో రాజకీయంగా ఎదుగలేకపోయారు. పార్టీలో కొత్తగా చేరిన వారికి పదవులు దక్కడం, ప్రజాప్రతినిధులుగా గుర్తింపు రావడంతో కొమురయ్యగౌడ్ నిర్లక్ష్యానికి గురయ్యాడు. తనను నిర్లక్ష్యం చేస్తున్నారని నియోజకవర్గ ప్రజాప్రతినిధుల తీరుపై కూడా ఆయన నిరసనలు తెలిపారు.

హత్య చేసి దుబాయ్ పరారీ !

- పది రోజుల్లో పథకం పూర్తి
- హత్య చేసి 10 గంటల వ్యవధిలోనే పరారీ



ఆరా తీస్తున్న సీఐ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): పక్కా ప్లాన్.. పది రోజుల్లో పని పూర్తి.. హత్య చేసిన రోజే దుబాయికి పరారీ అయిన నిందితుడు. ఇదీ చందుర్తి మండలం మల్యాలలో వివాహేతర సంబంధంలో యువకుడిని హత్యకు ప్లాన్. గ్రామానికి చెందిన పడిగెల నరేశ్‌ను వివాహేతర సంబంధంతో హత్యకు గురైన విషయం తెలిసింది. నరేశ్ గత నెల 29న మల్యాల గ్రామానికి దుబాయ్ నుంచి చేరుకోగా.. ఆమె భర్త మల్లేశం ఈనెల 3న ఇండియాకు వచ్చాడు. ఈ విషయం భార్యకు తెలువకుండా జాగ్రత్తపడి బంధువుల ఇంట్లో ఉండి హత్యకు పథకం రచించాడు. పది రోజుల్లో పని పూర్తి చేసుకోవాలనుకున్న మల్లేశం అనుకున్నట్లే అన్ని అమలు చేశాడు. ఈనెల 13వ తేదీ రాత్రి 10.25 గంటల నుంచి 10.40 గంటల మధ్య భార్య వద్దకు వెళ్లిన నరేశ్‌ను హతమార్చి బైక్‌పై పరారయ్యాడు. హత్య విషయం ఆలస్యంగా తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే సమయానికే ప్రధాన నిందితుడు జిల్లా దాటిపోయినట్లు సమాచారం. పోలీసులు స్పందించి లుక్‌ఔట్ నోటీసులు ఇచ్చేలోపే మల్లేశం దేశం దాటిపోయాడని తెలుస్తోంది.

పోలీసుల ముమ్మర విచారణ

మల్లేశంను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు వరకు ఎవరు తరలించారన్నది పోలీసులకు అంతు చిక్కడం లేదు. హత్య చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు ఏ వాహనంలో వెళ్లాడనే దానిపై ఆరా తీస్తున్నారు. అతనికి ఎవరెవరూ సహకరించారన్న కోణంలో పోలీసుల విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ హత్యతో నలుగురికి సంబంధం ఉందని భావించిన పోలీసులకు మల్లేశం దుబాయ్ చేరుకున్న విషయాన్ని సవాల్‌గా తీసుకున్నారు. ఈ కేసులో ప్రశ్నార్థకంగా మారిన చిక్కుముడులను విప్పేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

పార్టీలో ఉండలేం !

వేములవాడరూరల్: ప్రజల అండతో గెలిచిన తమను కొందరు నాయకులు చిన్నచూపు చూస్తున్నారని, ఇక పార్టీలో ఉండలేమంటూ వేములవాడ రూరల్ మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు జిల్లా స్థాయి నాయకులకు శుక్రవారం మొరపెట్టుకున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రానికి శుక్రవారం మంత్రి కేటీఆర్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ సభను విజయవంతం చేసేందుకు కొంత ఫండ్‌ను వేములవాడరూరల్ మండలానికి చెందిన ఒక నాయకుడికి రాగా.. ఎవరికీ ఇవ్వకపోవడంపై వారు కలత చెందినట్లు తెలిసింది. 17 గ్రామాల్లో ప్రజల ఓట్లతో గెలిచిన తమను కాదని పార్టీకి చెందిన మండలస్థాయి నాయకుడు వ్యవహరించిన తీరు సరిగ్గా లేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై పలువురు రాజీనామాకు సిద్ధమైనట్లు తెలిసింది.

సిరిసిల్లలో డీసీఎం వ్యాన్ బీభత్సం

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ఓ డీసీఎం వ్యాన్ బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం అంబేడ్కర్‌చౌక్‌లో జరిగిన మంత్రి కేటీఆర్ మీటింగ్‌కు పవర్ సప్లయ్ కోసం జనరేటర్‌ను తీసుకొచ్చిన డీసీఎం వ్యాన్ రాత్రి సమయంలో తీసుకెళ్తుండగా ఓ బైక్‌ను ఢీకొట్టింది. అంతేకాకుండా రివర్స్‌లో తీస్తుండగా పానీపూరి బండితో సహా నిలిపి ఉన్న రెండు బైక్‌లను ఢీకొట్టింది. అంబేడ్కర్‌చౌక్ నుంచి రివర్స్ తీస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు డీసీఎం వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు.

ఎటూ చూసిన గులాబీదళం

- 'సెస్' ఆఫీస్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ
- రెండు ర్యాలీలను రద్దు చేసిన బీఆర్ఎస్
- 'టెట్' నేపథ్యంలో ర్యాలీని కుదించాం
- బీఆర్ఎస్ వర్గాలు



బీఆర్ఎస్ నాయకుల ర్యాలీ

సిరిసిల్ల: మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత ర్యాలీలతో సిరిసిల్ల గులాబీమయమైంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులను సిరిసిల్లకు తరలించారు. సిరిసిల్ల ‘సెస్’ ఆఫీస్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మంత్రి కేటీఆర్ ఓపెన్ టాప్ జీపులో పట్టణంలో ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు అన్నీ గులాబీ జెండాలతో నిండిపోయాయి. అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో సభా ప్రాంగణం కిటకిటలాడింది. నర్సింగ్ కాలేజీ, ఇతర కాలేజీ విద్యార్థులను సభకు తరలించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి పాతబస్టాండు వైపు, ఇటు గాంధీచౌక్ దారి జనంతో నిండిపోయింది. సిరిసిల్లలోని అధికార పార్టీ కౌన్సిలర్లు తమ వార్డుల నుంచి ఊరేగింపుగా జనంతో సభాస్థలికి చేరుకున్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ఊరేగింపుగా వచ్చారు.

ర్యాలీల కుదింపు

సిరిసిల్లలో ముందుగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత ర్యాలీలను మూడు వైపుల నుంచి నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ శుక్రవారం సిరిసిల్లలో ‘టెట్’ నేపథ్యంలో రెండు ర్యాలీలను బీఆర్ఎస్ నాయకులు రద్దు చేశారు. కొత్త బస్టాండు, కొత్త చెరువు కట్ట నుంచి నిర్వహించాల్సిన ర్యాలీలను రద్దు చేసి ‘సెస్’ ఆఫీస్ నుంచి గాంధీచౌక్ మీదుగా ర్యాలీ తీశారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ కృతజ్ఞత సభ సక్సెస్ కావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది.

బాధ్యత లేని ప్రతిపక్షాలు: బీఆర్ఎస్

మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం సందర్భంగా సిరిసిల్లలో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత ర్యాలీ నిర్వహిస్తే.. బాధ్యత ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. మూడు ప్రాంతాల నుంచి ర్యాలీ నిర్వహించాల్సి ఉండగా.. ‘టెట్’ నేపథ్యంలో రెండింటిని రద్దు చేసి పరీక్ష కేంద్రాలు లేని మార్గంలోనే ర్యాలీ నిర్వహించామని ఆ పార్టీ పేర్కొంది. ‘టెట్’ను బాధ్యతగా నిర్వహించే ప్రభుత్వం తమదని వివరించారు. ప్రతిపక్షాల దింపుడు కల్లెం ఆశలు నెరవేరబోవని, భవిష్యత్‌లో ప్రజలు, విద్యార్థుల ఆగ్రహానికి గురయ్యేది ప్రతిపక్ష పార్టీలేనని బీఆర్ఎస్ స్పష్టం చేసింది.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రజల సంక్షేమం గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ఎజెండా అని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరులో 32 మంది లబ్ధిదారులకు శుక్రవారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేశారు. నూతన గ్రామపంచాయతీ, పొత్తూరు–కందికట్కూర్ మధ్య బ్రిడ్జి, యాదవసంఘం ప్రారంభించడంతోపాటు తెలంగాణతల్లి, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకాక ముందు గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, కేసీఆర్ సీఎం అయ్యాకే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని పేర్కొన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి తెలంగాణ సర్కారు పనిచేస్తుందన్నారు. దళితబంధు పథకం ద్వారా రూ.10లక్షల సాయం అందించి దళితుల బతుకుల్లో వెలుగులు నింపామన్నారు. బీసీ బంధు ద్వారా కులవృత్తులపైనే ఆధారపడిన వారికి రూ.లక్ష సాయం అందించి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, ఎంపీటీసీ పట్నం అశ్విని పాల్గొన్నారు.

మరో‘సారి’ వీగిన అవిశ్వాసం

- చైర్మన్‌గా గాజుల నారాయణ కొనసాగింపు
- సిరిసిల్ల అర్బన్‌బ్యాంకు రాజకీయానికి తెర
- బలపరీక్షకు హాజరుకాని మెజార్టీ డైరెక్టర్లు



నారాయణ

సిరిసిల్లటౌన్: అర్బన్‌బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణపై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మరోసారి వీగిపోయింది. చైర్మన్ తీరుపై వైస్‌చైర్మన్ సహా తొమ్మిది మంది డైరెక్టర్లు వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. నారాయణ ముగ్గురు సంతానం కలిగి ఉండడంతోపాటు బ్యాంకు నిర్వహణలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మెజార్టీ డైరెక్టర్లు గుర్రుగా ఉన్నారు. దీంతో అవిశ్వాస తీర్మానానికి బ్యాంకు ఉపాధ్యక్షుడు గడ్డం విఠల్‌తోపాటు తొమ్మిది మంది డైరెక్టర్లు డీసీవోను కోరుతూ ఆగస్టు 22న తీర్మాన పత్రాన్ని అందించారు. దీంతో సెప్టెంబర్ 15న అవిశ్వాస పరీక్షకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరు మాత్రమే హాజరు

బ్యాంకులో పన్నెండు మంది డైరెక్టర్లు ఉండగా.. మెజార్టీ సభ్యులు తొమ్మిది మంది అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. దీనికి ఉపాధ్యక్షుడు గడ్డం విఠల్, డైరెక్టర్లు మందాడి శ్రీనివాస్‌రెడ్డి, కోడం సంజీవ్, స్వర్గం రాజు, అడ్డగట్ల శారద, అడిచెర్ల సాయికృష్ణ, ఆడెపు అనసూర్య, నేరెళ్ల శ్రీకాంత్, వేముల రాములు సంతకాలతో అవిశ్వాస తీర్మానాన్ని కోరారు. డీసీవో బుద్ధానాయుడు శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సమావేశం నిర్వహించారు. ఇద్దరు డైరెక్టర్లు మాత్రమే హాజరుకావడంతో కోరం లేదని బలపరీక్ష వీగిపోయినట్లు ప్రకటించారు. అధికార పార్టీ పెద్దలతో గాజుల నారాయణ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. శుక్రవారం మంత్రి కేటీఆర్ జిల్లాకు రావడం.. అదే సమయంలో అవిశ్వాసం నిర్వహించడం సరికాదని బీఆర్ఎస్ పెద్దలు డైరెక్టర్లను తమదైన శైలిలో నచ్చజెప్పినట్లు చర్చ సాగుతోంది.

ఒకరిపై పీడీయాక్ట్

సిరిసిల్లక్రైం: వేములవాడ అర్బన్ మండలం శాభాష్‌పల్లికి చెందిన అన్నబోయిన తిరుపతియాదవ్ ఉరఫ్ ఏటీ యాదవ్‌పై పీడీయాక్టు నమోదు చేసినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి శుక్రవారం తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాలు. ఏటీ యాదవ్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ, ఇతర కేసులలో నేరడిగా ఉన్నాడు. సాధారణ ప్రజల మనసుల్లో భయాందోళనను సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడు. భవిష్యత్‌లో మరిన్ని నేరాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తాడన్న సమాచారంతో పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. వేములవాడటౌన్ సీఐ కరుణాకర్ ఈనెల 14న ఏటీ యాదవ్‌ను అదుపులోకి తీసుకుని, చర్లపల్లి జైలుకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చింతాల్‌ఠాణాకు చెందిన చందనపు శ్రీనివాస్(38) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శ్రీనివాస్ మద్యానికి బానిస కావడంతో ఏడాదిన్నర క్రితం విడాకులు తీసుకుంది. తిప్పాపూర్ ఎల్లమ్మ ఆలయం ప్రాంతంలో శుక్రవారం ఉదయం శ్రీనివాస్ చనిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహంపై షర్ట్ లేకపోవడం, ముఖంపై గాయాలు, రక్తపుమరకలు ఉండడంతో ఎవరో హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్స్ సేకరించే బృందాన్ని తీసుకొచ్చారు. మృతుడి తల్లి చందనపు విజయలక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడటౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

కామ్రేడ్ సింగిరెడ్డి భూపతిరెడ్డికి నివాళి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని లక్ష్మీపూర్‌లో కామ్రేడ్ సింగిరెడ్డి భూపతిరెడ్డి స్థూపానికి శుక్రవారం సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. వేణు మాట్లాడుతూ నిజాం నుంచి స్వేచ్ఛ కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జరిగిందని.. అమరుల త్యాగాలను మరవలేమన్నారు. రైతాంగ పోరాటంతో 3 లక్షల ఎకరాల భూమి ప్రజలకు అందిందని గుర్తు చేశారు. 3 వేల గ్రామాల్లో పోరాటాలు జరుగగా 4,500 మంది అమరులు అయ్యారన్నారు. సిరిసిల్ల ప్రాంతం నుంచి సింగిరెడ్డి భూపతిరెడ్డి, కర్రోళ్ల నర్సయ్య, బద్దం ఎల్లారెడ్డి, ఆనందరావు, బండ తిరుపతిరెడ్డి, రొండ్ల మాధవరెడ్డి అమరులయ్యారని గుర్తుచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఏ మాత్రం సంబంధం లేని బీజేపీ తెలంగాణ విమోచన వారోత్సవాలను నిర్వహించడం చరిత్రను వక్రీకరించడమేనన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పంతం రవి, కడారి రాములు, మంచికట్ల రమేశ్, సోమ నాగరాజు, విజయ్, మంత్రి చంద్రన్న, వనజ, శకుంతల, దేవేంద్ర, కళ్యాణి, బాలమణి పాల్గొన్నారు.

సిరిసిల్ల నుంచి అవకాశం ఇవ్వండి

ముస్తాబాద్(సిరిసిల్ల): సిరిసిల్ల అసెంబ్లీ స్థానం నుంచి ఆతనకు అవకాశం ఇవ్వాలని ఎల్లారెడ్డిపేట మండల నారాయణపూర్‌కు చెందిన నమిలికొండ శ్రీకాంత్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. శ్రీకాంత్ మాట్లాడుతూ కొంతకాలంగా బీజేపీలో చురుకైన నాయకునిగా పనిచేస్తూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తున్నామన్నారు. బీజేపీ తరఫున సిరిసిల్ల అసెంబ్లీ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు .మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఉమాశంకర్ తదితరులున్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన అముద

క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

కోదాడ: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

అడుగడుగునా అండగా నిలిచిన 'సాక్షి'

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో 'సాక్షి'కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని 'అయ్యో అముద'శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

మూడు 'రియల్' సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏజెన్సీకి వైద్యాధికారులు

'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'ఏజెన్సీకి ఫీవర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రంతోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహాసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

నర్సాపూర్‌రూరల్: మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు నేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చోబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్ట్రన్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూఫ్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.

అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

సాక్షి, హైదరాబాద్: మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

టీచర్ల భర్తీ తర్వాతే...

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రెడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

విద్యతోనే సామాజిక న్యాయం

- సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి
- యూనివర్సిటీ సినిమా ప్రమోషన్‌లో భాగంగా నస్పూర్‌కు రాక


నారాయణమూర్తిని సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: విద్యతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్. నారాయణమూర్తి అన్నారు. మంచిర్యాల జిల్లా సింగరేణి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం నారాయణమూర్తిని సన్మానించారు. అనంతరం సీసీసీలోని సింగరేణి గెస్టుహౌస్‌లో నిర్వహించిన యూనివర్సిటీ సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో నారాయణమూర్తి మాట్లాడారు. తాను నటించి, నిర్మించి, దర్శకత్వం, సంగీతం వహించిన యూనివర్సిటీ సినిమా అక్టోబర్ 13న విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా నస్పూర్‌కు వచ్చానని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన, జరుగుతున్న పరీక్షల పేపర్ లీకేజీ ఇతివృత్తంగా యూనివర్శిటీ సినిమా రూపొందించామని చెప్పారు. విద్యారంగంలో పేపర్ లీకేజీ అనేది భారత దేశంలో పెను ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని తెలంగాణ, ఏపీ, గుజరాత్, అసోం, ఎంపీ, బీహార్, యూపీ రాష్ట్రాలలో పేపర్ లీకేజీలు జరిగాయని వివరించారు. విద్యా వ్యవస్థ చిన్నాభిన్నం అయితే మొత్తం వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. పేపర్ లీకేజీలను అరికట్టాల్సిన బాధ్యత స్వయం ప్రతిపత్తి కలిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై ఉందని తెలిపారు. విద్య జాతీయ సంపద అని దానిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. సినిమా బాగుంటే చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తారని, దానికి ఉదాహరణ బేబీ సినిమానే అని అన్నారు. జీతం జీవితం రెండూ ఇంగ్లిష్ బాషపైనే ఆధార పడి ఉన్నాయని, నేటి సమాజంలో ఇంగ్లిష్ భాష ప్రాముఖ్యతను ఈ సినిమాలో బలంగా చూపించామని తెలిపారు. పండుగల సెలవులు, పబ్లిక్ హాలిడేస్‌లో థియేటర్లలో చిన్న సినిమాల ప్రదర్శనకు ఉదయం ఆటను చిన్న సినిమాలకు కేటాయించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరామని తెలిపారు. నా సినిమా ప్రదర్శనకు సహకరించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. తన సినిమాకు ప్రజాయుద్ధనౌక గద్దర్‌తోపాటు తెలంగాణ కళాకారులు పాటలు అందించారని వెల్లడించారు. యూనివర్సిటీ సినిమాను ఆదరించాలని కోరారు.

ఎన్నికల బరిలో ఉంటా.. ఆశీర్వదించండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


కన్నీరు పెట్టుకుంటున్న ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నుంచే తాను బరిలో ఉంటానని ఎమ్మెల్యే రేఖానాయక్ స్పష్టం చేశారు. మీ ఆశీస్సులు కావాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. చింతగూడ లక్ష్మీదేవి ఆలయంలో పూజలు చేశారు. అక్కడే ఓ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక మహిళలతో ఆప్యాయంగా మాట్లాడారు. రెండుసార్లు ఆశీర్వదించినట్లుగానే వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. 12 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన తనకు ఈసారి టికెట్ ఇవ్వలేదని కన్నీరు పెట్టుకున్నారు. దీంతో స్థానిక మహిళలు ఎమ్మెల్యేను ఓదార్చారు. తర్వాత ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సీపతి రామ్మూర్తి కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి జన్నారం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. మంజూరైన అభివృద్ధి పనులు నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు జరిగితే తనకు పేరు వస్తుందని ఆరు నెలలుగా కొంతమంది పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని తెలిపారు. అనంతరం చింతలపల్లి గ్రామానికి వెళ్లి ప్రజలతో కలిసి మాట్లాడారు. అక్కడ గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట జన్నారం సర్పంచ్ గంగాధర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్‌కుమార్, కాంతమణి తదితరులు ఉన్నారు.

నృత్యకారులకు సన్మానం..

జిల్లా నృత్య కళాసమాఖ్య అధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు గాజుల సహస్రగౌడ్, శ్రేణు, సంకర్ష్, వర్షిణి, తన్విక, అశ్విత, మోక్షితలను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమానికి రేఖానాయక్ హాజరైన మాట్లాడారు. జాతీయస్థాయి నృత్య పోటీలకు రాష్ట్రం నుంచి 18 మంది ఎంపిక కాగా, అందులో 8 మంది జన్నారం మండలానికి చెందినవారే కావడం గర్వకారణమన్నారు. చిన్నారుల్లోని కళలను వెలికితీసి, వారి ప్రతిభ జాతీయ స్థాయిలో చూపిస్తున్న మాస్టర్లను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నృత్య కళాసమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్, డ్యాన్స్ మాస్టర్లు లక్ష్మణ్, రమేశ్, నర్మదగౌడ్, నాయకులు సతీశ్‌కుమార్, కాంతామణి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి


కార్యక్రమంలో వీసీ, డైరెక్టర్, కంపెనీల ప్రతినిధులు

భైంసా: విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలని ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ అన్నారు. శుక్రవారం వర్సిటీలో కాకతీయ శాండ్‌బాక్స్, దేశ్‌పాండే ఫౌండేషన్, గ్రాడ్ క్యాపిటల్ వ్యవస్థాపకులతో వ్యవస్థాపక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌పై 'యువ' ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజురెడ్డి, కాకతీయ శాండ్‌బాక్స్ సీఈవో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల కోసం 'వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ'లో మూడు నెలల నాన్ క్రెడిట్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉన్నట్లుగానే ప్రతీ పనికి ఒక నూతన ఆవిష్కరణలు చేయడానికి విద్యార్థులు సాంకేతికంగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్ ఎట్ ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో రాకేశ్‌రెడ్డి కోఆర్డినేటర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ఇంజినీర్స్ డే..

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇంజినీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ సతీశ్‌కుమార్, వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మోక్షగుండంవిశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీ శాంతి జగదీశ్వరి, అధ్యాపకులు కలీల్, వహీద్, వినోద్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్సీ 'అగ్రి' ప్రవేశాలు షురూ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాకు కొత్తగా మంజూరైన బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 11 నుంచి తొలివిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఏడుగురు విద్యార్థులు ఆదిలాబాద్ కళాశాలలో సీట్లు పొందినట్లుగా కళాశాల అసోసియేట్ డీన్ శ్రీధర్‌చౌహాన్ తెలిపారు. శనివారంతో తొలివిడత ముగియనుండగా మరికొంత మంది ప్రవేశాలు పొందే అవకాశముందని పేర్కొన్నారు. రాంనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గల కృషి విజ్ఞాన కేంద్రం భవనాల్లో ప్రారంభించనున్న ఈ కళాశాలకు ప్రభుత్వం 60 సీట్లు కేటాయించిన విషయం తెలిసిందే. పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కాని పక్షంలో రెండు, మూడో విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని డీన్ పేర్కొన్నారు.

అధికారులు వర్సెస్ కార్మికులు

- దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల్లో ఆందోళన
- సీఎంవోఏఐ కోర్టుకెక్కడంతో కార్మిక సంఘాల ఆగ్రహం
- అధికారుల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు
- సమ్మెకు పిలుపునిచ్చిన జాతీయ కార్మిక సంఘాలు


సింగరేణి కార్మికులు

గోదావరిఖని: కార్మికుల వేతనాలపై కోలిండియా అధికారుల సంఘం కోర్టుకెక్కడం కార్మికులకు ఆగ్రహం తెప్పిస్తోంది. మా జీతాలు పెరిగితే వాళ్లకేమి కష్టమంట అంటూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఈక్రమంలో అధికారుల సంఘం వర్సెస్ కార్మిక సంఘంగా మారుతోంది. విభేదాలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు రోజుల సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. 11వ వేతన ఒప్పందం అమలు కావడంతో కోలిండియా వ్యాప్తంగా ఉన్న సింగరేణి, బీసీసీఎల్, ఎస్‌సీఎల్, మహానది కోల్‌ఫీల్డ్స్, ఎస్ఈసీఎల్, డబ్లుసీఎల్, ఈసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న మూడున్నర లక్షల మందికి పెరిగిన వేతనాలు అమలువుతున్నాయి. ఈసమయంతో అధికారుల సంఘం కోర్టుకెక్కడం కార్మిక సంఘాలకు ఆగ్రహం తెప్పిస్తోంది. తమకు వేతనాలు పెరగాలని పోరాడాలే తప్ప కార్మికుల వేతనాలు ఎందుకు పెరిగాయని వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నాయి. అధికారుల వేతన ఒప్పందం పదేళ్లకోసారి, కార్మికుల వేతన ఒప్పందం ఐదేళ్లకోసారి జరుగుతుంది. ఈసమయంలో వేతనాల పెరుగుదల అవకాశం ఉంటుంది. ఈక్రమంలో రెండు నెలల కిందట జరిగిన వేతన ఒప్పందంలో కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఈ–4 నుండి కింది స్థాయి అధికారులకన్నా కార్మికుల వేతనాలు ఎక్కువగా ఉండే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. అయితే పదేళ్లకోసారి మాత్రమే పెంచేందుకు అవకాశం ఉండటంతో చేసేదేమి లేక కార్మికుల వేతనాలను ఎక్కువగా ఉన్నాయని అధికారులు కోర్టుకెక్కడం హాస్యాస్పదం అంటున్నారు.

వేతనాలపై ప్రభావం చూపితే ఊరుకోం..

తాము యాజమాన్యంతో పోరాడి 11వ, వేతన ఒప్పందం సాధించుకున్నామన్నారు. ఈక్రమంలో అధికారుల సంఘం కోర్టుకెక్కడంతో కార్మికుల వేతనాలు నిలిచిపోతే ఊరుకునేది లేదని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. అధికారులు పోరాడి వేతనాలు పెంచుకోవాలే తప్ప కార్మిక వేతనాలపై కోర్టుకెక్కడం సరికాదంటున్నారు. ఈక్రమంలో కార్మికుల వేతనాలపై ప్రభావం చూపితే అధికారులపై తిరుగుబాటు తప్పదని హెచ్చరిస్తున్నారు.

వచ్చేనెల 5,6,7 తేదీల్లో సమ్మె

అధికారుల తీరును నిరసిస్తూ కోలిండియా వ్యాప్తంగా వచ్చేనెల 5,6,7 తేదీల్లో సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈమేరకు కోలిండియా స్థాయిలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రకటించాయి. తాము పోరాడి సాధించుకున్న వేతనాలపై ప్రభావం చూపితే అధికారుల అంతుచూస్తామని హెచ్చరిస్తున్నాయి. ఈవిషయంలో అధికారులు పునరాలోచించుకుని ఇన్నేళ్ల పాటు అధికారులు, కార్మికుల మధ్య ఉన్న సత్సంబందాలు కొనసాగించాలంటున్నారు.

ఇక అధికారులపై పోరాటమే..



కార్మికుల వేతనాలపై కోలిండియా అధికారుల సంఘం(సీఎంఓఏఐ) జబల్‌పూర్ హైకోర్టులో పిటిషన్ వేసింది. రెండు నెలలుగా 11వ వేతన ఒప్పందం ప్రకారం కార్మికుల జీతాలు పెరిగాయి. ఈక్రమంలో అధికారులు కోర్టుకెక్కడం వల్ల కార్మికుల పెరిగిన జీతాలు ఆగితే ఊరుకోం. ఇంత ఎంత మాత్రం సమంజసం కాదు.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షులు

సమ్మెను విజయవంతం చేయాలి



కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇదే వైఖరితో ముందుకు సాగితే ఇరువురి మధ్య అంతరం పెరుగుతుంది. ఇన్నేళ్ల పాటు కొనసాగిన సత్సంబందాలు దెబ్బతింటాయి. అధికారులు వేతనాలు పెంచుకుంటే తమకేమి ఇబ్బంది కాబోదు. పెరిగిన వేతనాలు ఆగితే ఊరుకోబోం.

– యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు

మావోయిస్టులపై ప్రత్యేక నిఘా

- భూపాలపల్లిలో అంతర్ రాష్ట్ర పోలీసుల సమావేశం
- దిశా నిర్దేశం చేసిన సీపీ రెమా రాజేశ్వరి


సమావేశంలో సీపీ రెమా రాజేశ్వరి, ఎస్పీలు

గోదావరిఖని: రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర పోలీసు అధికారులు నిర్ణయించారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జెన్‌కో కాన్ఫరెన్స్ హాల్‌లో భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షతన వహించిన రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి చర్చించారు. మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సంబంధిత సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని నిర్ణయించారు. ఫలితంగా మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరమవుతుందన్నారు. దీని ద్వారా ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించవచ్చని తెలిపారు. రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయటంతో పాటు మద్యం, డబ్బు ఇతర ఇల్లీగల్‌కు సంబంధించి అక్రమ రవాణా అడ్డుకట్ట పడుతుందన్నారు. సరిహద్దు గుండా అక్రమ మద్యం, మహారాష్ట్ర దేశీదారు, గంజాయి మొదలైన వాటి రవాణా నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ములుగు ఎస్పీ గౌస్ ఆలం, కొమురంభీం ఆసిఫాబాద్ ఎస్పీ కె.సురేశ్‌కుమార్, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్, మంచిర్యాల్ డీసీపీ సుధీర్‌కేకన్, ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్, ఇతర రాష్ట్రాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.